

# నేను - నా నవలలు
## సూర్యదేవర రామ్ మోహన్‌రావు



1985లో 'మోడల్' నవలతో తెలుగు నవలా ప్రపంచంలో రచయితగా అడుగుపెట్టిన రామ్ మోహనరావుగారు మొదటి నవలతోనే సంచలన రచయితగా పేరు తెచ్చుకున్నారు. తరువాత వ్రాసిన ప్రతి నవలకీ ఒక వైవిధ్య భరితమైన నేపథ్యాన్ని ఎన్నుకుని, ప్రతి కథాంశం మీద ఎన్నో పరిశోధనలు చేశారు. చరిత్రనీ, వాస్తవాలనీ, విశ్లేషణనీ, కల్పననీ సమపాళ్ళలో రంగరించి 'ఇన్వెస్టిగేటివ్ ట్రెండ్ సెట్టర్'గా తెలుగు నవలా పాఠకుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఈయన నవలలు ఇతర భారతీయ భాషల్లోకి అనువదించబడి అన్ని చోట్లా సంచలనం సృష్టించడం మరో విశేషం. ఇంతవరకూ 92 నవలలు వెలువరించి అతి త్వరలోనే వందవ నవల మైలురాయిని చేరబోతున్న శ్రీ సూర్యదేవర నిరంతర అన్వేషి, నిత్య పరిశోధకుడు, విలక్షణ రచయిత. వారి నవలల వెనుకనున్న కృషినీ, అందుకోసం ఆయన చేసిన ఆసక్తికరమైన పరిశోధనా విశేషాలనీ నెలనెలా 'కౌముది' పాఠకులతో పంచుకోబోతున్నారు. ఇది ఆయన కేవలం 'కౌముది' కోసమే వ్రాస్తున్న ప్రత్యేక శీర్షిక..!

'రక్తచందనం' నవల రచనా నేపథ్యం

### పూర్వ రంగం

రెండో భాగం



అతనికి అతని భార్యంటే చాలా ఇష్టం... ఆమెకీ ఆమె భర్తంటే ప్రాణం..

పుట్టింటికి వచ్చిన అతని భార్య లక్ష్మి నిండు గర్భవతి.

తనకు పుట్టబోయే బిడ్డను చూసుకునేందుకు అతను తప్పక వస్తాడని మాటు వేసిన వందలాదిమంది పోలీసుల కళ్ళలో దుమ్ముకొట్టి బిడ్డను చూసుకుని క్షేమంగా తిరిగి తన స్థావరానికి చేరుకున్నాడతను.

తమిళనాడు, కర్నాటక సరిహద్దుల వెంట 2,500 కిలోమీటర్ల పొడవున్న దట్టమయిన అడవులలో పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు ఫలితం లేక కళ్ళు తేలవేశారు.

6 సెప్టెంబరు 1990....

చోడిమత్తి అటవీ ప్రాంతం...

తమిళనాడు... కర్నాటక సరిహద్దులు...

సాయుధ పోలీసులు అతనితో తలపడటానికి సిద్ధమవుతుండగా ఆ విషయాన్ని పసిగట్టిన అతను విజయవంతంగా తప్పించుకుని తిరిగి అడవులలోకి పారిపోయాడు.

అతన్ని, అతని అనుచరులను అతి సమీపంలో చూసిన కర్నాటక సాయుధ పోలీసులు అతనిపై ఒక్క ఉదుటున కాల్పులు జరపాల్సింది పోయి విస్తుపోయి చూస్తుండిపోయారని, ఆ సమయాన్ని చక్కగా వినియోగించుకుని అతను పారిపోయాడని అధికార వర్గాలు వాపోయాయి.

అదీ అతని ధైర్యసాహసాల స్థాయి..! అతని తెలివితేటలు అనితర సాధ్యం.... ఎత్తుగడలు అత్యద్భుతం....

దొరికినట్లే అనిపించి, ఎప్పటికీ దొరక్కుండా తప్పించుకు తిరగటం అతనికి వెన్నతో పెట్టిన విద్య. సవాల్ విసిరి మరీ తను అనుకున్న పనుల్ని సజావుగా జరిపించుకోగల అపరచాణుక్యుడు.

సింహంలా గర్జించగలడు. ఏనుగులా ఘీంకరించగలడు.

ఒంటెలా రోజుల తరబడి అన్నాహారాలు లేకుండా ఉండగలడు.

బైసన్‌లా పదిరోజులు ఆహారాన్ని ఒక్కరోజులోనే తినగలడు.

జాకాల్‌లా క్షణాల్లో పోలీసుల కన్నుగప్పగలడు.

మిన్నాగులా అడ్డొచ్చే, వారిని నిశ్శబ్దం మాటున కాటేయగలడు.

శబ్దబేధి అతనికున్న విద్యలలో ఒకటి.

ధ్వని తాలూకు సూక్ష్మ పరమాణువుని సయితం పసిగట్టగల శబ్దగ్రాహకాలు అతనికి కవచకుండలాలు. శబ్దాన్ని బట్టి తన దిక్కుకేసి వస్తున్న జంతువుల సంఖ్యని గుర్తించగలడు. వాసనని బట్టి ఏ జంతువయినదీ తెలుసుకోగలడు.

లేదంటే క్రూరమృగారణ్యంలో మనలేడు కదా..! ఎక్కడుంటాడో ఉన్న చోట ఎన్ని ఘడియలుంటాడో - ఎన్ని విఘడియల్లో కదులుతాడో. ఏ దిక్కుకు మరలుతాడో - ఎవ్వరూహించలేరు... అతను పాదరసంలాంటివాడు.

మేగ్నమ్ 500

ఎక్స్‌ప్రెస్ 470

లాంటి అత్యాధునికమయిన మారణాయుధాలు అతని చేతుల్లో గువ్వలయితే - ప్రాణాలిచ్చయినా అతడ్ని కాపాడేందుకు నలభైమంది అనుచరులు అనుక్షణం సర్వసన్నద్ధంగా ఉంటారు.

విశ్వాసానికి మారుపేరుగా ఒక కుక్క, కోతి అతన్ని నీడలా వెంటాడుతుంటాయి. అవసరమయినప్పుడు శత్రుజాడని పసిగడతాయి. అనుకూల పరిస్థితుల్లో మార్గదర్శిగా వ్యవహరిస్తాయి.

అతను తరచూ మద్రాస్, బెంగుళూరు, ఊటీ బొంబాయి వెళ్ళి వస్తుంటాడని కొందరు... అతనికి రాజకీయ నాయకులతో సన్నిహిత సంబంధాలున్నాయని ఇంకొందరు విశ్వసిస్తారు.

ముప్పై తొమ్మిదివేల ఎకరాల ఆ మహారణ్యం అతనికి పటిష్టమైన రక్షణ దుర్గం... కడుపులో దాచుకునే కన్నతల్లిలాంటిది.

అసంఖ్యాక పోలీసుల శోధన...

లాంగ్ డిస్టెన్స్ వాక్స్....

అగ్రెసివ్ పెట్రోలింగ్....

ఎడతెరిపిలేని కూంబింగ్ ఆపరేషన్స్ ఎలాంటి ఫలితాన్నీ ఇవ్వలేకపోయాము.

అందుకు సగం కారణం గాలి వార్తలు...

ప్రాక్టికల్ జోక్స్‌ప్లే చేసే మూర్ఖులు... అర్థం పర్థం, ఆధారంలేని ఐడెంటిఫికేషన్ మార్క్స్.

మనిషి మామూలుగా ఉంటాడని - సన్నగా ఉంటాడని - సాధారణంగా కనిపిస్తాడని గుబురుగా మెలితిరిగి ఉండే మీసాలు అతని ముఖంలోని ప్రత్యేకత అని గాలివార్తలు ప్రచారంలోకి తెచ్చిపెడుతుంటారు కొందరు. ఆ కొందరు గాని - ఆ కొందరికి కట్టుకథకు చెప్పి అవతల వాళ్ళు ఆశ్చర్యపోతే ఆనందించే అర్భకులు కానీ అతన్ని చూశారా? లేదు అసలెవరూ అంతవరకు అతన్ని చూడలేదు. చూసిన కొద్దిమంది పెదవి విప్పటంలేదు.

తమిళనాడు, కర్నాటక రాష్ట్రప్రభుత్వాలు అతన్ని పట్టి, అతను ఖచ్చితంగా అతనిని నిరూపించినవారికి లక్షల్లో పారితోషకం ప్రకటించాయి. ఇలా ఎనౌన్స్ చేయటం అసాధారణ విషయం.

దేశ చరిత్రలో ఒక ఫారెస్ట్ స్మగ్లర్ కోసం రెండు రాష్ట్రాలు పెద్ద మొత్తాల్లో కేష్ అవార్డుని ప్రకటించటం బహుశా ఇదే ప్రథమం కావచ్చు. అలాంటప్పుడు అతను ఇలా ఉంటాడని - అలా ఉంటాడనే ఊహాగానాలు చేసి, ప్రచారం చేయటంలో రీజనింగ్ ఏమన్నా ఉందా?

అతనెవరో అందరికీ తెలుసు.

ఎలా ఉంటాడో - ఎక్కడుంటాడో తెలియదు.

ఏం చేస్తాడో తెలుసు.

ఎలా చేస్తాడో తెలియదు.

తన గురించి తను పూర్తిగా తెలుసుకుని, తన గురించి ప్రపంచానికేమీ తెలియనివ్వని ఇన్‌స్క్రూటబుల్ మైటీపర్సనాలిటీ - మూడు రాష్ట్రాల పోలీసుల్ని ముప్పతిప్పలు పెడుతూ, మూడొందల చెరువుల నీళ్ళు తాగిస్తున్న ఆ వ్యక్తి ప్రతి ఒక్కరికి ఒక ఎనిగ్మా.

అసలతను బ్రతికే ఉన్నాడా? ఏమో తెలీదు.

అతని పేరు మీద వేరే ఎవరన్నా సంచరిస్తున్నారా?

ఫేక్ ఇమేజ్ ప్రొజెక్టనా..?

ఏమో...

అధికారం ఇచ్చే నిషా - డబ్బిచ్చే కుషీ గురించి బాగా తెలిసినవాళ్ళు ఆడిన చదరంగంలో గదులు మారి, గాడి తప్పిన ఒక వ్యక్తి వాళ్ళకెలా మనీ మెషిన్‌గా మారాడు? చేస్తున్నది ఎంతో కొంత తప్పని తెలిసి కూడా బయటకు రాలేక కొన్నాళ్ళు - వచ్చే అవకాశం ఉన్నా అలాగే ఉండటం వ్యసనమై ఇంకొన్నాళ్ళు, తను బయటకు వచ్చే క్షణమే తనకు, తన వాళ్ళకు తనను నమ్ముకున్నవాళ్ళకు ఆఖరి క్షణమవుతుందని అందులోనే ఉండిపోయిన ఒక అద్భుతమయిన వ్యక్తి అతను.

హీ ఈజ్ ఒన్ ఆఫ్ ది మోస్ట్ వాంటెడ్ క్రిమినల్స్ ఇన్ ది కంట్రీ.

మాసీవ్ మేన్ హంట్‌ని, వేలాది అధికారుల వేటని, మూడు రాష్ట్రాల పోలీసుల ముట్టడిని సయితం నిర్వీర్యం చేస్తున్నది ఒకే ఒక వ్యక్తి అంటే ఆశ్చర్యం కాదు...?!

కర్నాటక స్టేట్ రిజర్వ్ పోలీస్ సామర్థ్యానికి, వెల్ ట్రెయిన్డ్ ఐ.పి.యస్. ఆఫీసర్స్ తెలివితేటలకే ప్రశ్నగా మారినది ఒకే ఒక వ్యక్తి అంటే అద్భుతంగా అనిపించదూ!?

(ఇవన్నీ విన్న మీదటే వీరూ గురించి పరిశోధనకు శ్రీకారం చుట్టాను.)

తను చేసేది తప్పని, ప్రపంచం ఒప్పని, అతన్ని నమ్ముకున్న ప్రపంచం విశ్వసిస్తున్నా తను మాత్రం ఎక్కడికో .. ఎందరో వెళ్ళేందుకు సాహసించని మృత్యువు అంచుకు చేరిన వ్యక్తి జీవితం ఎవరికయినా ఉద్యేగం కలిగించగలదు అన్న ఉద్దేశ్యమే కాదు - ఎన్నో నిజాల్ని బయటకు లాగవచ్చనే సదుద్దేశం కూడా ఈ నవల రాయటానికి కారణాలయ్యాయి.

బండిపురా ఫారెస్ట్‌లో చందనం దొరుకుతుందని, గంజాయిని పండించటం లేదని - మత్తుపదార్థాలు, జంతు చర్మాల వ్యాపారం జరగటం ఇంతవరకు లేదనే నిజాల నేపథ్యాలతోటి, చేసిన పరిశోధనా సారాంశాన్ని తప్పుదారి పట్టించక - కేవలం పేపర్ కటింగ్స్‌తోటే కథ అల్లటంలాంటి పనులు చేయక విన్న అద్భుతాన్ని, కన్న దృశ్యాల్ని కలిపి నేను చేసిన ప్రయత్నమే ఈ "రక్తచందనం"!

ఒక వ్యక్తి నేరస్తుడు కావటానికి ఎవరెలా కారణమవుతారు? ముఖ్యంగా రాజకీయాలు - అతను చందనం స్మగ్లర్ అని కొందరు తెలిసి అన్నా - తెలీక మరేదో చేస్తాడని మరికొందరు అన్నా, వాటికందని చాలా నిజాలు అతని జీవిత గమనంలో మరుగున పడివున్నాయి.

ఇంతకీ ఎవరతను? అతనే ములుక్కన్ - అతనే వీరప్పన్ -అతనే వీరూ

అతనే వీరపాండ్యకట్ట బ్రహ్మన పేరు పట్ల మోజు పడ్డవాడు...

అతను చేసేది ఏమిటి? అతని జీవిత లక్ష్యం ఏమిటి? కేవలం ఐదారు తరగతులకు మించి చదవని అతను అత్యాధునిక నేరప్రపంచ పరిశోధనా పద్ధతులకు ఎలా ప్రశ్నగా మారాడు?

ప్రపంచం ఆశ్చర్యపోయే ఎత్తుకు ఎదగటానికి - ఆ ప్రపంచానికి దొరక్కుండా తప్పించుకు తిరగటానికి చదువే అక్కర్లేదేమో... తెలివితేటలు.. సమయస్ఫూర్తి, మానవ బలహీనతలపై అవగాహన ఉంటే చాలేమో...

పేపర్ కట్టింగ్స్‌ని బట్టి నవలలు రాయాలని కొందరు, సినిమాలు తీయాలని ఇంకొందరు ప్రయత్నించినా (ఆ పైన ఫుల్‌స్టాప్ పెట్టినా) వెరవకుండా నేను ఈ ప్రాజెక్ట్‌ని చేపట్టటానికి కారణం నేను సేకరించుకున్న విలువైయిన సమాచారం వేరెవరివద్దా లేకపోవటమే.

నా పరిశోధనలో నేను పొందగలిగిన విలువయిన డాక్యుమెంట్స్‌లో పోలీస్ డైరీ ఒకటి.

"రక్తచందనం" నవలకి శ్రీకారం చుట్టింది 1989లో. అప్పటినుంచే వీరప్పన్ గురించిన సమాచార సేకరణ మొదలెట్టాను. అందుకే ఈ నవలలో 1992 డిసెంబర్ వరకు జరిగిన సంఘటనల్నే తీసుకున్నాను. 1992 -93 లో ఈ నవల స్వాతిలో సీరియల్‌గా వచ్చింది. ఈ నవల రాయటానికి నాకు రెండున్నరేళ్ళు పట్టింది. వీరప్పన్ తిరిగే లోతట్టు అటవీ ప్రాంతాలకు మైసూర్ నుంచి మొట్టమొదటిసారి బయలుదేరింది 9-7-1989 నాడు.

11-7-1992 నాడు కర్నాటక దిన పత్రికల్లో వీరప్పన్ మీద నేను నవల వ్రాయబోతున్నట్లు వార్తవచ్చింది. ఈ వార్త ఇటు పోలీస్, ఫారెస్ట్, బి.ఎస్.ఎఫ్. వర్గాలకు, అటు అటవి ప్రాంతానికి చేరిపోయింది. రెగ్యులర్‌గా కన్నడ దినపత్రికల్ని తెప్పించుకుని చట్ట వ్యవస్థల కూంబింగ్ ఆపరేషన్స్ గురించి తెలుసుకోవటం వీరప్పన్ అప్రమత్తతకు నిదర్శనం.. అయితే అప్పటికే అడవిలోకి వెళ్ళిపోయిన నాకు ఇవేమీ తెలియవు గనుక ఏకబిగిన మూడువారాలు వీరప్పన్ తిరిగే ప్రాంతాల్లో తిరుగుతూ సమాచారాన్ని సేకరించుకున్నాను.

అందుకే మొదటి దఫా పరిశోధన నుంచీ మైసూర్ రాగానే అప్పటికే నాకోసం ఎదురుచూస్తూన్న కర్ణాటక స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌కి చెందిన ఐ.పి.ఎస్ ఆఫీసర్, మైసూర్ జిల్లా ఎస్.పి.టి హరికృష్ణ నాకోసం తన సిబ్బందిని నేను విశ్రాంతి తీసుకుంటున్న భండారీ ఇంటికి పంపించారు.

హరికృష్ణ ఎంతో ధైర్యసాహసాలు, పట్టుదల, నిజాయితీ, క్రమశిక్షణ ఉన్న అధికారి. వీరప్పన్ని పట్టుకునేందుకు ఇతను చెయ్యని ప్రయత్నమూ, సాహసమూ లేదు.

అయితే పోలీస్ సిబ్బందిలో కొందరు వీరప్పన్ పే రోల్ లో ఉండడంతో చివరి నిమిషంలో రహస్యప్రణాళికలు, పథకాలు, ఎత్తుగడలు వీరప్పన్ కి చేరిపోయేవి.

ప్రతినెలా లక్షలకు లక్షలు లంచాలిస్తూ అన్ని శాఖలలో తన మనుషులు ఉండేలా చేసుకున్న మేధావి వీరప్పన్.

ఎమ్.ఎమ్. హిల్స్‌లో నాకు సహకరించిన సబ్ ఇన్స్‌పెక్టర్ షకీల్ అహ్మద్‌ని, మరో నలుగురు పోలీస్ సిబ్బందిని, ఐ.పి.ఎస్ ఆఫీసర్ హరికృష్ణని ఆగస్ట్14, 1992 నాడు పట్టపగలు మీన్యా అడవిలో వీరప్పన్ నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపేశాడు.

దాంతో కర్ణాటకలో ఆగస్ట్15, 1992 నాడూ స్వాతంత్ర్యదినోత్సవం జరగలేదు. శవాలఊరేగింపు మాత్రమే జరిగింది బెంగుళూరులో .

1991 సెప్టెంబర్ నెలలో తిరిగి నేను మైసూరు నుంచి బయలుదేరి గుర్రపుడెక్కల ఆకారంలో ఉండే కర్నమలై, నాగమలై, శంకరమలై, మైరమలై అనే కొండల మధ్య ఉన్న గోపీనాథం గ్రామానికి వెళ్ళాను విజయ్, భండారీలతో కలిసి. ఆ గ్రామానికి ఉత్తర, దక్షిణ , పడమర దిశలో కొండలుంటే తూర్పు దిశలో కావేరి నది ప్రవహిస్తూ ఉంటుంది. ఈ సారి మా మకాం గోపీనాథంలోనే.

వీరప్పన్ తల్లిదండ్రుల స్వగ్రామం తమిళనాడుకి చెందిన ధర్మపురి అయితే వీరప్పన్ పుట్టకముందే వాళ్ళు బ్రతుకుతెరువు కోసం కావేరి నది దాటి కర్ణాటకలోని గీపీనాథం వచ్చి సెటిలైపోయారు.

నేను గోపీనాథం వెళ్ళిన సమయానికి వీరప్పన్ కుటుంబానికి చెందిన వాళ్ళెవరూ ఆ ఊరిలో లేరు. వీరప్పన్ ఆచూకి కోసం అతను కుటుంబ సభ్యుల్ని పోలీసులు తరచు ఇంటరాగేట్ చేయడంతో వాళ్ళు అదృశ్యమైపోయారు.

పోలీస్ స్టేషన్ ముందే పొద్దున, సాయంత్రం వేరుశెనక్కాయలు అమ్ముకునే కెంపమ్మ అనే వృద్ధురాలు వీరప్పన్‌కి ఇన్ఫార్మర్ గా పనిచేసేది. కెంపెమ్మ లాగే ఎంతోమంది పోలీసుల కళ్ళుబడకుండా వీరప్పన్ కి ఇన్ఫార్మర్లుగా పనిచేసేవాళ్ళు. ఆమెను మూడు, నాలుగుసార్లు కలిశాను. అయితే కళ్ళల్లో నన్ను చూడగానే కొద్దిపాటి అసంతృప్తి చోటుచేసుకుంది. నాకేసి అసహనంగా చూసేది.

ఒక దశలో ఆ ప్రాంతంలో నన్ను ఉండవద్దని, వివరాలు సేకరించుకోవటం మంచిది కాదని మృదువుగానే కన్నడంలో చెప్పింది.

గోపీనాథం నుండి అలంబడి, హొగెనికల్ ఫాల్స్‌కి వెళ్ళేదారిలో వెహికిల్స్ వెళ్ళలేవు. వీరప్పన్‌కి అలంబడి ప్రాంతంలో మకాం చేయడమంటే చాలా ఇష్టం.

ధైర్యం చేసి నేను, విజయ్, భండారీ బయలుదేరాం. నీటి పాయలు, జలపాతాలు, లోయలు పచ్చటి తివాచీలు పరిచినట్లుండే ఆ ప్రాంతాలు ఎంత మనోహరంగా ఉంటాయో అంత ప్రమాదకరం కూడా అయితే మా దగ్గర తెల్లజెండాలున్నాయి. ప్రమాదం వస్తే మేం మీకు శత్రువులం కాదని సంకేతం ఇచ్చేందుకు. అవి తీసి గాల్లో ఊపటానికి... మాబ్యాగుల్లో జ్వరం, ఒళ్ళునొప్పులకి, సీజనల్ డిసీజెస్‌కి కావాల్సిన మందులుండేవి. వాటితోపాటు తట్టుకోలేని భయమేస్తే వేసుకోటానికి ఏంటీ ఎంగ్జైటీ టాబ్లెట్స్, బిస్కెట్స్, వాటర్ బాటిల్స్ టేప్ రికార్డర్, టార్చ్‌లైట్స్, గొంగళ్ళు, స్వెట్టర్స్ ఉండేవి. రెండో దశలో అలంబడి, చెమ్మేడు, అడిపాలార్, సిల్విక్కల్ పాలాయం, కొదల్లి, రామాపుర, పాలార్ బ్రిడ్జి, నల్లూర్, హుగ్గిమ, జెల్లిపాలాయం, మక్కం పాలాయం, ప్రకాష్ పాలాయం, మెట్టూర్, టట్టకేరీ, ఆండియూర్, గార్గికెండీ, భవానీ ప్రాంతాల్లో తిరిగి వివరాలు సేకరించుకున్నాం.

మేమలా తిరుగుతుండగానే ఒక అత్యద్భుత సంఘటన మేమున్న ప్రాంతానికి 30 కిలోమీటర్ల దూరంలోనే జరిగింది. అది అప్పుడు నాకు తెలియలేదు.

వీరప్పన్ పాలార్ రివర్ ప్రాంతంలో ఉన్నాడని పోలీసులకు ఉప్పందింది. దాంతో రహస్యంగా రెండువేల మంది పోలీసులు అటవీ, బి.ఎస్.ఎఫ్ సిబ్బంది వీరప్పన్ కార్నర్ చేయటానికి బయలుదేరారు. వీళ్ళంతా హిల్లో ఫారెస్ట్ రేంజ్‌లో శిక్షణ పొందిన కమెండోలు.

కావేరీ నది ఒక చోట 'యు' షేప్‌లో ప్రవహిస్తూ ఉంటుంది. మూడువేపులా నది.. ఒక వేపే అక్కడి నుండి బయటపడే దారుంది. ఆ దారిని కవర్ చేస్తూ పోలీసులు చాపక్రింద నీరులా నిశ్శబ్దంగా దూసుకురాసాగారు.

ఈ ఇన్‌ఫార్మేషన్ వీరప్పన్‌కి చేరిపోయింది. అయితే అప్పటికే సమయం మించిపోయింది. ఆ అటవీ ప్రాంతమంతా ఎడతెగని వర్షాలు... చలిగాలులు ... అడుగుతీసి అడుగువేయాలంటే నరకయాతన. దారి మూసుకుపోబోతోంది. వెనక కుడి, ఎడమవైపు కావేరీ నది ప్రమాద స్థాయి దాటి ప్రవహిస్తోంది. గజ ఈతగాళ్ళయినా నది ఉధృతికి కొట్టుకుపోవలిసిందే ఆ ప్రాంతంలో అక్కడక్కడా ఉండే పడవలు సయితం ఆ సమయంలో రక్షించలేవు. ఇది పోలీసులకీ తెలిసిపోయింది. అందుకే రెట్టించిన ఉత్సాహం ఓ వైపు. తమ సహచరుల్ని ఎందర్నో పొట్టన బెట్టుకున్నాడన్న పగ ప్రతికారాలు మరోవేపు... వీరప్పన్ దొరికిపోతాడంతే అని మీడియా అడవీ ప్రాంత ప్రజలు కొందరు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

అంత తేలిగ్గా వీరప్పన్ పోలీసులకు పట్టుబడతాడా...? అసాధ్యం అని మరికొందరు... మూడో రోజు సాయంత్రానికి పోలీసులకు, వీరప్పన్ కి మధ్య ఉన్న దూరం కేవలం ఐదు కిలోమీటర్లు....

అనుచరులంతా భయంతో ఒణికిపోతుంటే వీరప్పన్ చాలా కూల్‌గానే పెద్ద గొయ్యి తియ్యమని ఆదేశించాడు.

వీళ్ళు గొయ్యి తియ్యగానే ఒక ఏనుగుపిల్లని తెప్పించి ఆ గోతిలోకి దింపించి, దాన్ని టార్చర్ పెట్టమని ఆదేశించాడు వీరప్పన్.

ఓ పక్క పోలీసులు అత్యాధునిక ఆయుధాలతో దూసుకువస్తుంటే, గొయ్యితీయటం, ఏనుగు పిల్లని దింపటం, దాన్ని టార్చర్ పెట్టటం ఏమిటో ఏం అర్థం కాలేదు అనుచరులకి.

పిల్ల ఏనుగు టార్చర్ భరించలేక అరవటం మొదలుపెట్టింది. ఆ అరుపులు విని వందల సంఖ్యలో ఏనుగులు తరలిరావటం మొదలింది.

కారు మేఘాల్లా కమ్ముకొస్తున్న ఏనుగుల మందని చూడగానే కమెండోల నోట మాట రాలేదు. ఒకటి రెండు ఏనుగులైతే ఎదుర్కోవచ్చు... వందలాది మదించిన మదపుటేనుగులు... పైగా వయలెంట్‌గా దూసుకొస్తున్నాయి. చంపితే నేరం... వాటిని చంపి ముందుకెళ్ళకపోతే వీరప్పన్ తప్పించుకుంటాడు. కమెండోలకు పిచ్చి పట్టినట్లయింది.

వీరప్పన్‌కి కమెండోలకి మధ్య గుంట, అందులో పిల్ల ఏనుగు, దాన్ని రక్షించుకోటానికి కొస్తున్న వందలాది మదగజాలు.

వీరప్పన్ ఎత్తుగడకు కమెండోలు సయితం హేట్సాఫ్ చెప్పక తప్పని దీనస్థితి .. గుంటలో ఉన్న పిల్ల ఏనుగుని రక్షించడానికి మిగతా ఏనుగులకి మూడు రోజులు పట్టింది.

ఈ సమయం చాలు వీరప్పన్ తప్పించుకోవటానికి....

చదువు సంధ్యలు లేని వీరప్పన్‌కి ఇన్ని తెలివితేటలెలా వచ్చాయి..? వీరప్పన్ ఐ.క్యూ ఎంత అనే ఆలోచన అప్పుడే ఉన్నతాధికారుల కొచ్చింది. మేం మరికొన్ని రోజులకి పాలార్ నది ప్రాంతానికి వెళ్ళి ఒక చిన్న టౌన్‌లో మకాం వేశాం.

అప్పట్లో మోస్ట్ వాంటెడ్ క్రిమినల్స్‌లో వీరప్పన్‌ది మొదటి స్థానం. కర్నాటక పోలీస్, అటవీ సిబ్బంది మీద కేంద్రప్రభుత్వం సీరియస్ అయింది.

వీరప్పన్ కోసం వేట ముమ్మరమయిపోయింది.

లాంగ్ డిస్టెన్స్ వాక్స్... ఎగ్రెసివ్ పెట్రోలింగ్... సీరియస్ కూంబింగ్ ఆపరేషన్స్.... అంతలో ఓ వార్త గుప్పుమంది. ఆ రాత్రే వీరప్పన్ పది లారీల గంధం మొద్దుల్ని రవాణా చేయబోతున్నాడని...

అడవుల్లో వివిధ ప్రదేశాల్లో మకాం చేసున్న కమెండోలు మూడో కంటికి తెలియకుండా వీరప్పన్ గంధం మొద్దుల్ని రవాణా చేసే అవకాశమున్న పోలార్ బ్రిడ్జి ప్రాంతానికి చేరుకున్నారు. కొందరు పొదల్లో మరికొందరు చెట్లమీద కాపుకాసారు. వీరప్పన్‌కున్న మార్గమదొక్కటే....

మాకా వార్త తెలిసింది. మేమున్న టౌన్‌కి పాలార్ బ్రిడ్జి ఆరుకిలోమీటర్ల దూరంలో ఉంది. మాకా రాత్రంతా నిద్రలేదు. ఆ టౌనులో ప్రజలు కూడా ఏం జరగబోతోందని ఉత్కంఠతో ఆ రాత్రంతా ఎదురుచూసారు.

మరుసటి రోజు తెలిసింది జరిగిన విషయం...

వీరప్పన్ కావాలనే ఆ వార్త పోలీసులకి చేరేలా చేసాడు. పోలీసులు పాలార్ బ్రిడ్జి మీద నిఘా వేసుంటే కొన్నినెలల క్రితమే నరికి ఎండబెట్టిన గంధం మొద్దులు లాట్లు, లాట్లుగా నది మీద తేలుతూ కమెండోలు నిఘా వేసిన బ్రిడ్జి క్రిందనుంచే దిగువ ప్రాంతానికి రవాణా అయిపోయాయి.

ఫారెస్ట్ ఫైర్ వాచ్ గార్డు ఒకరు ఎత్తైన చెట్టుమీద నుంచి ఆ దృశ్యాన్ని చూసి వైర్‌లెస్‌లో మెసేజ్ ఇచ్చేసరికి కమెండోలు షాక్‌కి లోనయ్యారు.

కోట్లాది రూపాయల గంధం చెక్క నిశ్శబ్దంగా అప్పటికే అడవి దాటెళ్ళిపోయింది.

వీరప్పన్ దళం అడవుల్లో ఎటు తిరిగినా వాటర్ సోర్సెస్ దగ్గర్లోనే మకాం చేస్తుంది. మంచి నీళ్ళకి, వంటకి, స్నానాలకు కాలకృత్యాలకి నీళ్ళు అవసరం.. అప్పుడప్పుడు వాటర్ సోర్సెస్ మీద పోలీసులు నిఘా వేస్తుండేవాళ్ళు.

వీరప్పన్ అనుచరులు రాత్రుళ్ళే వంట చేసుకునే వాళ్ళు. పగలైతే పొగ పైకి లేచి తమ ఆచూకి తెలిసిపోతుందని.

మేం చాలాసార్లు మారుమూల అడవుల్లో కొందరు వంటచేసుకుని భోంచేసిన ఆనవాళ్ళు చూశాం... అది వీరప్పన్ బృందం పనే.. అని తరువాత తెలిసింది.

ఆగస్ట్ 4, 1989 నాడు ఫారెస్టర్ మోహనయ్య చంపబడ్డాడు.

ఫిబ్రవరి 8, 1990 ఫారెస్ట్ గార్డ్ ఒకరు హత్య చేయడ్డాడు.

ఫిబ్రవరి 9, 10, 1990 లో పెద్ద మొత్తంలో గంధం చెక్కని అధికారులు సీజ్ వేసారు.

బ్రైబింగ్ అఫీషియల్స్.... థ్రెటెనింగ్ ఇన్ ఫార్మర్స్....

లైపింగ్ అవుట్ రైవల్ గ్యాంగ్స్ ఈ పద్ధతిలో వీరప్పన్ మాస్టర్ పోచర్‌గా, బిగ్ టైమ్ శాండల్ ఉడ్ స్మగ్లర్‌గా మారిపోయాడు.

9-4-1990 రోజు ఒక ఇన్‌ఫర్మేషన్ వచ్చింది. వీరప్పన్ తన అనుచరులతో ధర్మపురి జిల్లా, హొగెనేకల్ ఫాల్స్ ప్రాంతంలో మకాం చేసున్నాడని. మేం తిరుగుతున్న ప్రాంతంలో మా గురించి ఎవరూ నెగెటివ్‌గా అనుకోకపోవటం వల్ల, చిన్న చిన్న హోటల్స్‌లో, బడ్డీకొట్లలో, బస్‌స్టాండ్స్‌లో ఎవరో ఒకరు ఏదో ఒక ఇన్‌ఫర్మేషన్ ఇస్తుండేవాళ్ళు మాకు.

అప్పట్లో... అంటే 1981 నుంచి వీరప్పన్ చనిపోయేవరకు కొన్ని వందల గ్రామాల్లో పట్టణాల్లో ప్రజలకు కాలక్షేపం డ్రామాలు, సినిమాలు, టీవీ, పత్రికలు కాదు - వీరప్పన్ కదిలికలు వార్తలు.... అంటే ఎంతో ఉద్వేగంతో వినేవాళ్ళు.... అంతకంటే ఉత్సుకతతో పక్కవాళ్ళకు చెప్పేవాళ్ళు... అదే పెద్ద కాలక్షేపం వాళ్ళకి.

పై ఇన్‌ఫర్మేషన్ పోలీసులకి కూడా చేరిపోయింది.

పోలీసులు హొగెనకల్‌ఫాల్స్ ప్రంతానికి వెళ్ళేసరికి, వీరప్పన్ తన అనుచరులతో వేరే ప్రాంతానికి తరలిపోయినట్లు తెలిసింది....

అప్పుడే ఆరిపోతున్న ఒక కట్టెలపొయ్యని ట్రేస్ చేసారు పోలీసులు. అందులోంచి పొగ చిన్నగా వస్తోందంట. పక్కనే అన్నం మెతుకులు, బోన్స్, కొన్ని మాంసం ముక్కలు, లిక్కర్ సీసాలు, మూతలు, బీడీ, సిగరెట్ పీకలు, అగ్గిపుల్లలు కనిపించాయట.

దాదాపు పాతిక మంది అక్కడ చాలాసేపు గడిపినట్లు అక్కడ తడినేలమీద పడిన పాదముద్రల్నీ, నలిగిపోయిన గడ్డిని బట్టే అంచనా వేసారు.

పొయ్యి ఇంకా పూర్తిగా ఆరిపోలేదంటే ఎంతో దూరం వెళ్ళి ఉండరని ఊహించగానే పోలీసుల వెన్నులో చలి... అప్పటికే చీకటి పడబోతోంది. ఆ సమయంలో అడవి అంతర్భాగంలో ఉండటం ప్రమాదమని పోలీసులు వెంటనే బయలుదేరారు.

వాళ్ళలో మైసూర్ విద్యారణ్యపురం పోలీస్ స్టేషన్ ఎస్.ఐ.పి. జగన్నాథ్, లష్కర్ స్టేషన్ ఎస్.ఐ రామలింగు మహదేశ్వర బెట్ట ఎస్.ఐ శంకర్‌రావ్, మైసూర్ కృష్ణరాజస్టేషన్ ఎస్.ఐ. చంద్రప్ప, శ్రీనివాసమూర్తి, శివకుమార్, మల్లేష్, ఎస్.ఐ కృష్ణ అర్స్ ఉన్నారు.

ఒక కొండవాలులో ఉన్న ఘాట్ రోడ్ మీంచి ఎమ్.ఎమ్.హిల్స్ కేసి వస్తుండగా సడెన్‌గా జీప్ ఆగిపోయింది. రోడ్డుకడ్డంగా బండరాళ్ళు పెట్టున్నాయి.

వెంటనే అనుమానించి రక్షణ కోసం ఒక హైడౌట్‌ని చూసుకుంటే పోయేది. అలా కాక నడుచుకుంటూ వెళ్ళి బండల్ని తొలిగించే ప్రయత్నంలో కొందరుండగా, జడివానలా కొండపై నుంచి బుల్లెట్స్ వర్షంలా వచ్చిపడ్డాయి.

కృష్ణ అర్స్ తెలివితేటలు, ధైర్యసాహసాల మూలంగా మిగతావాళ్ళు గాయాలతో బయటపడ్డారు.

ఇది మాకు మరుసటి రోజు తెలిసింది.

అంతమంది ఒకే జీప్‌లో (సి.ఎ.జి.4455) ఎలా వెళ్ళారు? ఒకవేళ మార్గమధ్యంలో జీప్ చెడిపోతే...? ఎన్నో ప్రశ్నలకు మాకు సమాధానాలు దొరకలేదు.

ఏప్రిల్ 10-1990 రోజు మైసూర్ నగరం స్థంభించిపోయింది.

ఆ నాలుగు శవాలను మైసూర్ నగరవీధుల్లో ఊరేగిస్తూ స్మశానానికి తీసుకువెళ్ళారు.

సంఘటన జరిగింది ఏప్రియల్ తొమ్మిదిన. మైసూర్ బంద్, శవాల ఊరేగింపు ఏప్రియల్ పది రోజు.

పదకొండున ఓ ఉన్నతాధికారి సంఘటన జరిగిన ప్రదేశానికి వెళ్ళి ఎంక్వైరీ చేయగా, తాము చూసింది వీరప్పన్ అవునో కాదో తమకు తెలియదనీ, సన్నగా, గడ్డం పెరిగున్న ఓ వ్యక్తి, గర్భవతి అయిన ఓ స్త్రీని నడిపించుకుంటూ అడవుల్లోకి వెళ్ళిపోయినట్లు క్షతగాత్రులైన వాళ్ళు చెప్పారు.

1970 లో వీరప్పన్ డ్రైవింగ్ లైసెన్స్‌కోసం దిగిన ఫోటో మాత్రమే పోలీసుల దగ్గరుందని నా పరిశోధనలో తేలింది.

అత్తూర్ అనే గ్రామంలో ఓ వీరప్పన్ మనుషులు ఒక సీనియర్ నర్స్‌ని కిడ్నాప్ చేసి, ఆ పైన ఒక మెడికల్ షాప్‌ని అర్ధరాత్రి పగలగొట్టి సెలైన్ బాటిల్స్, సోడియమ్ క్లోరైడ్, పెథిడిన్, టించర్, మెడికేటెడ్ కాటన్, సర్జికల్ సిజర్స్ లాంటివి దొంగిలించుకుపోయారు.

మేము మరుసటిరోజే అత్తూర్ మెడికల్ షాప్ దగ్గరికెళ్ళాం..

అంటే... అడవిలో... వీరప్పన్ బృందంలో ఎవరికో ట్రీట్‌మెంట్ అవసరమై ఉంటుంది....

ఒక వ్యక్తి, ఒకే ప్రాంతంలో దేవుడిలా, దెయ్యంలా భావించటం అన్నది వీరప్పన్ విషయంలోనే జరిగింది.

(కొనసాగింపు వచ్చేనెలలో)

suryadevaranovelist@gmail.com